క్లుప్తంగా...

నియామకం



షియాన్ సయ్యద్ ఇఫ్తెకార్ హుస్సేన్

జియాగూడ: తెలంగాణ నుంచి కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కియో) షిహన్ సయ్యద్ ఇఫ్తెకార్ హుస్సేన్‌ను రెఫరీ మెంబర్‌గా నియమించింది. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలోని తల్కటోర స్టేడియంలో క ఇయో ద్వారా ప్రతినిధి హ్యాంషి భరత్ శర్మ ద్వారా షిహన్ సయ్యద్ ఇఫ్తెర్‌ఖార్ హుస్సేన్ చేతుల మీదుగా బ్యాచ్ అందుకున్నారు. అనంతరం ఇఫ్తెకర్ హుస్సేన్ మంట్లాడుతూ..తనకు అప్పగించిన బాధ్యతలను గౌరవంగా నిర్వహిస్తానన్నారు. ఈ సందర్భంగా కియో కార్యదర్శి సంజీవి కుమార్ జుంగ్ర, టీఎస్‌కెడీఏ అధ్యక్షుడు బి.మహేష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో సంస్కృతం ప్రాముఖ్యత తెలియజేయాల్సిన అవసరం ఉందని సీనియర్ ఉపాధ్యాయులు డి.ప్రభాకర్ శర్మ అన్నారు. సాధన సాహితీ శ్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ స్వర్ణ సాంబశివరావు రచించిన సంస్కృత కావ్య విమర్శ, పాత్రోచితభాష పుస్తకాల ఆవిష్కరణ సభ మంగళవారం కళా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి తరం విద్యార్థులు పరభాషా మోజులో పడి తెలుగు, సంస్కృతాలను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యులు ఎ.రాములు, సంస్కృతి భారతి ట్రస్ట్ చైర్మన్ సీహెచ్. లక్ష్మీనాదచార్య, న్యాయవాది ఎస్.అనంతకృష్ణ, సంస్కృత సేవకులు శేషావతారం, సంస్థ అధ్యక్షులు సాధన నర్సింహాచార్య, కార్యదర్శి శంభుని కుమార్ పాల్గొన్నారు.

మాదిగ హిమాలయ ఋషి సమ్మేళనానికి మద్దతివ్వండి



చార్మినార్: రాష్ట్రంలో పెద్ద ఎత్తున మాదిగ హిమాలయ ఋషులతో ఋషి సమ్మేళనం నిర్వహించనున్నామని..ఇందుకు పార్టీ మద్దతు అవసరమని ఆది పురుష ధర్మ సమాజం ప్రతినిధుల బృందం మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును కలిసి కోరింది. ఈ మేరకు ఆది పురుష ధర్మ సమాజం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్, కార్యదర్శి గాదేపాగ బాలకృష్ణ, రవీంద్రనాథ్, ధర్మ ప్రచార ప్రధాన ధర్మ కర్త ప్రొఫెసర్ ఏకు తిరుపతి తదితరులు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.

సత్కారం



అబిడ్స్: కేంద్ర విచారణ సంస్థ (సీబీఐ) అధికారిగా ఎంపికైన సన్నిధి సౌమ్యశ్రీని తెలంగాణ రాష్ట్ర అటపా ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. సీబీఐ మాజీ అధికారి జేడీ లక్ష్మీనారాయణ మంగళవారం ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కష్టించి విద్యలో ప్రతిభ కనబరిచిన సన్నిధి సౌమ్యశ్రీ దేశంలోనే ఉత్తమమైన సీబీఐ అధికారిగా ఎంపిక కావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అటపా అధ్యక్షుడు మదిపెద్ది శంకర్, ఇతర అటపా నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి

అబిడ్స్: ప్రజలకు వర్షంతో సమస్యలు తలెత్తకుండా చూడాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం సూర్యమహల్, ఎంజేమార్కెట్, కరాచి బేకరి లేన్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి వర్షంతో ఇబ్బందులకు గురైన ప్రజలను పరామర్శించారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పర్యటించి వర్షంతో పలు బస్తీలు, మురికివాడల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వర్షం సమస్యలను స్వయంగా చూడాలన్నారు. ఏఈ మహేందర్, శ్యామ్‌సుందర్, సంతోష్ శుక్లా, తివారి, కైలాష్ మిశ్రా, కిశోర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



టోలిచౌకీ చౌరస్తా వద్ద అధ్వానంగా మారిన రోడ్డు



ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలు

గోల్కొండ: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలను హైరానా పట్టించాయి. ఓ వైపు రోడ్లు అధ్వానంగా మారగా మరో వైపు ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే ఉండిపోయాయి. సీజనల్ వ్యాధులు వ్యాపించి ఉండగా వర్షాలకు అవి మరింత విజృంభించాయి. కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, నానల్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల అంతర్గత రహదారులు సైతం గుంతలమయంగా మారాయి. గుడిమల్కాపూర్ మెయిన్ రోడ్డు, కార్వాన్ బంజావాడీ, రేతిబౌలి చౌరస్తా, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఇంకా వర్షపు నీరు నిలిచి ఉంది. షేక్‌పేట్ నాలా నుంచి టూంబ్స్ వైపు వెళ్లే రోడ్డు సైతం వర్షానికి గుంతలమయంగా మారింది. టూంబ్స్ చౌరస్తా నుంచి టోలిచౌకీ చౌరస్తా వైపు వచ్చే రోడ్డుపై వాహనాదారులు ఇబ్బందులు వాహనాలు నడుపుతున్నారు. ఎండిలైన్స్ చౌరస్తా, ఫ్లోర్ మిల్, సాలర్‌జంగ్ కాలనీ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలలోని రోడ్డు గుంతలమయంగా మారి వాహనాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి.

ఎక్కడి చెత్త అక్కడే..

వరుసగా వర్షాలు కురుస్తుండగా పారిశుద్ధ్య అధికారులు మాత్రం పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ కనబరచడం లేదు. కార్వాన్, ఆసిఫ్‌నగర్ అహ్మద్‌నగర్ ఫస్ట్ ల్యాన్సర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల పక్కన గత వారం రోజులుగా భారీ చెత్త కుప్పలు పడి ఉన్నాయి. వర్షానికి ఇవి తడిసి దుర్గంధాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. సూర్యనగర్ కాలనీ, నదీమ్ కాలనీ, గోల్కొండ నయాకీలా తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. గోల్కొండ పాత మిలట్రీ క్వాటర్స్, బంజారా దర్వాజా, గోల్కొండ కఠోరా హౌస్ తదితర ప్రాంతాల్లో సైతం చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. ఇదిలా ఉండగా బల్దియా వారు ఏర్పాటు చేసిన మాన్సూన్ స్పెషల్ స్క్వాడ్ కేవలం బడాబాబులు నివసించే ప్రాంతాలకే సేవలను పరిమితం చేశాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాలనీలు, బస్తీల పరిసరాల్లో ఉన్న చెత్త కుప్పలనే మాన్సూన్ స్క్వాడ్ సిబ్బంది తరలిస్తున్నారు. పేదలు నివసించే ప్రాంతాలను మాత్రం మాన్సూన్ స్పెషల్ టీమ్‌లు అస్సలు కానరావడం లేదు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు



రేషన్‌కార్డు దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులతో పాటు పులిపాటి రాజేష్‌కుమార్

చార్మినార్: అర్హులందరికీ రేషన్‌కార్డులను అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని..అందుకే ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల మంజూరీ కోసం ఎదురు చూస్తున్న వారికి లబ్ధి చేకూరుతుందని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్ అన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి చొరవతో కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. అయితే తమ నియోజకవర్గంలో దరఖాస్తు పరిశీలన మందగించడంతో విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికార యంత్రాంగం కదిలి విచారణను వేగవంతం చేశారన్నారు. సర్కిల్-3 సహాయ పౌరసరఫరాల అధికారి పర్యవేక్షణలో సంబంధిత అధికారులు, సిబ్బంది మంగళవారం నియోజకవర్గంలోని ఉందాబజార్, మహారాజ్‌గంజ్‌లలో దరఖాస్తుదారుల ఇంటింటికీ వెళ్లి విచారణ నిర్వహించారన్నారు.

నేడు బాధ్యతలు చేపట్టనున్న నూతన జోనల్ కమిషనర్



శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ నూతన జోనల్ కమిషనర్‌గా ఎస్.శ్రీనివాస్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ పనిచేసిన టి. వెంకన్న సోమవారం బదిలీ కాగా.. ఆయన స్థానంలో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎమ్మార్డీసీఎల్) లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధి నిర్వహణ కొనసాగిస్తున్న ఎస్.శ్రీనివాస్ రెడ్డిని ప్రభుత్వం జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌గా నియమించింది. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉన్న శ్రీనివాస్ రెడ్డి తిరిగి జోనల్ కమిషనర్‌గా రావడంపై పాతబస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా మంగళగౌరి వ్రతాలు

విజయనగర్‌కాలనీ: శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున మంగళగౌరి వ్రతాలు ఆచరించారు. ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయ కాలనీ, మాసబ్‌ట్యాంక్, విజయనగర్‌కాలనీ శ్యామ్‌నగర్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాలతో పాటు బస్తీలు, కాలనీలు తదితర ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తైదువులను పూజకు ఆహ్వానించి పసుపుబొట్టు, వాయనాలు ఇచ్చారు.

మజ్లిస్ ప్రజల పార్టీ: ఎమ్మెల్యే కౌసర్



మహ్మద్ జాహెద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజల పార్టీ అని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలుసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ ఎమ్మెల్యేను కలిసి వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ వికలాంగులకు వారికి స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లుగా కార్వాన్ నియోకవర్గంలో ఎందరో వికలాంగులకు తాను వివిధ సంక్షేమ పథకాల ద్వారా రుణాలు ఇప్పించాన్నారు.

సెయింట్ ఆన్స్‌లో నేషనల్ లైబ్రేరియన్స్ డే



డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో మంగళవారం యూజీ లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ లైబ్రేరియన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ సిస్టర్ ప్రశాంతి మాట్లాడుతూ.. గ్రంథాలయాలకు ఒక కొత్త రూపునిచ్చిన మహనీయుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ విభాగాధిపతి రాజ్యలక్ష్మి, నిషిత, డాక్టర్ అనురాధా, సిస్టర్ సరిత, డాక్టర్ శ్రీకళ తదితరులున్నారు.

‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ ప్రభుత్వం’



రాహుల్ గాంధీ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఏఐసీసీ జూబ్లిహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి విశ్వనాథ్ అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి ఆయన రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా షేక్‌పేట్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచే ప్రజాస్వామ్య విలువలను గౌరవించే పార్టీగా పేరుపొందిన్నారు. పేదల గుండెల్లో గూడుకట్టుకున్న పార్టీగా కాంగ్రెస్ పేరుపొందిందని ఇది జీర్ణించుకోలేని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులను వేధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, అఫ్రోజ్, జ్యోతి, రఘు, శేఖర్, మక్బూల్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



వేడుకల్లో మంత్రి కొండా సురేఖ తదితరులు

సుల్తాన్‌బజార్: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. టీఎన్జీఓస్ దేవాదాయ శాఖ యూనిట్ అధ్యక్షుడు బాబు శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో బోనాల వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొండా సురేఖ హాజరై అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆరుగురికి కారుణ్య నియామకాల ఆర్డర్స్‌ను ఇచ్చారు. దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, అడిషనల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఆర్‌జెసి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో..

కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో కనకదుర్గ ఆలయం (పంట మైసమ్మ)లో ఉస్మానియా మెడికల్ కళాశాల టీఎన్జీఓ యూనిట్ అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, నగర అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, వెంకటేష్, డాక్టర్ ఎం.పద్మావతి, మెడికల్ కాలేజ్ టీఎన్జీవో యూనిట్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



వేడుకల్లో టీఎన్జీ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తదితరులు

బీజేపీ నాయకుడి హౌస్ అరెస్టు



చార్మినార్: పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలకు బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీని మంగళవారం ఉదయం మీర్‌చౌక్ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రయత్నించే తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను హౌస్ అరెస్టు చేయడం సరైంది కాదన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పించాలి



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేముల రామకృష్ణ తదితరులు

విజయనగర్‌కాలనీ: రాష్ట్రంలో ప్రైవేటు, ఎయిడెట్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ అవకాశం కల్పిస్తున్నారని, అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కూడా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యా సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..చాలా మంది విద్యార్థులు తెలిసి తెలియక, అవగాహన లోపంతో, టెక్నికల్ పొరపాట్ల ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు పొందలేకపోయారన్నారు. పేద విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు దొరకగా ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో ఫీజులు కట్టలేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉన్నత విద్యామండలి చైర్మన్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. అదేవిధంగా ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులు పెంచొద్దని, విద్యాహక్కు చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. ఇందుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

ఆర్థోపెడిక్ వైద్యంలో రోబోటిక్ వ్యవస్థ ప్రారంభం



ఉదయ్ ఓమ్నీ ఆసుపత్రిలో రోబోటిక్ వ్యవస్థను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

అబిడ్స్: రోగులకు ఉత్తమ చికిత్స అందించేందుకు అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థ నాంది పలుకుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం అబిడ్స్ చాపల్‌రోడ్డులోని ఉదయ్ ఓమ్ని ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యంలో రోబోటిక్ వ్యవస్థను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..దక్షిణాది రాష్ట్రాల్లో అత్యాధునిక రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సేవలు ప్రారంభం కావడంతో ఆర్థోపెడిక్ రోగులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ ఓమ్ని ఆసుపత్రి జాయింట్ రిప్లేస్‌మెంట సర్జరీ చీఫ్, డైరెక్టర్ ట్రామా ఆర్థో డాక్టర్ ఉదయ్ ప్రకాష్ మాట్లాడుతూ..ఆర్థోపెటిక్స్, ట్రామా కేర్‌లో ఉదయ్ ఓమ్ని ఆసుపత్రి 50 ఏళ్లుగా విశేష సేవలందించిందన్నారు. ఈ రోబోటిక్ శస్త్ర చిత్సల ద్వారా అత్యుత్తమ ఫలితాలు ఉంటాయన్నారు. ఈ నెల ఆఖరులో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్ ప్రారంభిస్తామన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో మనోహర్‌రెడ్డి, డాక్టర్ భీశ్వ సురేఖ



ఉప్పుగూడలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేతలు

అబిడ్స్/అఫ్జల్‌గంజ్: అబిడ్స్ నిజాం కళాశాల వద్ద తిరంగా ర్యాలీ రాష్ట్ర కన్వీనర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, గోల్కొండ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్ గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీని ప్రారంభించారు. దాదాపు 500 మంది విద్యార్థుల జాతీయ జెండాలను చేతపట్టుకొని అబిడ్స్ చాపల్‌రోడ్డు, గన్‌ఫౌండ్రీ బషీర్‌బాగ్ ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో భీశ్వ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో గోపాల్‌జీ తదితరులు

గోషామహల్‌లో..

గోషామహల్‌లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు, యువత జాతీయ జెండాలని చేతపట్టుకుని ప్రదర్శన చేశారు.

ఉప్పుగూడలో..

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్థూపం నుంచి మొదలైన యాత్ర ఉప్పుగూడ మహంకాళి ఆలయం, శివాజీనగర్, అశోక్ నగర్ చౌరస్తాల మీదుగా శివాజీ చౌక్ వరకు కొనసాగింది. చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మామిడి కృష్ణ, నాయకులు శ్రీనివాసారావు, సిరి వెన్నెల, రోహిత్, చిరంజీవి, వెంకటేష్, బాలు నాయక్, వెంకటేష్, జయ పాల్గొన్నారు.

అధికారులు స్పందించారు.. సమస్యను పరిష్కరించారు

సాక్షి ఎఫెక్ట్..

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, పేరుకుపోయిన బురద తదితర సమస్యలపై ‘సాక్షి’ దినపత్రికలో ‘మురుగుమయం..బురద భయం’ అనే శీర్షికతో ప్రచురితమైన వార్త కథనానికి సంబంధిత అధికారులు మంగళవారం స్పందించారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, బురదమయంగా మారిన ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.



డ్రైనేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



బూర్గుల నాగేందర్‌కు అవార్డును అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం 2వ మహాసభ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు ఇచ్చే విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని హామీనిచ్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య మాట్లాడుతూ.. సమాజంలో డప్పు ద్వారా సమాచారాన్ని చేరవేసిన మొట్టమొదటి జర్నలిస్టు మాదిగేనని గుర్తు చేశారు. అనంతరం బూర్గుల నాగేందర్, రాజేందర్‌కు దళితరత్న అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, టి.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నాగేందర్ మాదిగ, గౌరవ సలహాదారులు చుంచు లింగయ్య, గౌరవ అధ్యక్షులు పాల్వాయి బాలయ్య పాల్గొన్నారు.

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరికి జైలు

చాంద్రాయణగుట్ట: శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతిపై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు యువకులకు నాంపల్లి న్యాయస్థానం మంగళవారం 7 రోజుల జైలు శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ పి.మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..శాలిబండకు చెందిన మహ్మద్ అయాన్(22), మహ్మద్ హుస్సేన్(22) యువతిపై అసభ్యంగా ప్రవర్తించారు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై షమా నూర్ ఈ-పెట్టి కేసు నమోదు చేశారు. కేసును విచారించిన నాంపల్లి 9వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మంద మురళీ ఇద్దరికి 7 రోజుల జైలు శిక్షను విధించారు.